క్లుప్తంగా

మందిరాల నిర్మాణానికి భూమి పూజ



విజయపురిసౌత్: స్థానిక సాగర్‌మాత దేవాలయం ప్రధాన గేటుకు ఇరువైపులా మందిరాల నిర్మాణానికి ఆలయ విచారణ గురువు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఆదివారం ప్రత్యేక ప్రార్థనలతో భూమి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆలయంలో దివ్యబలిపూజలో పాల్గొని, ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అనంతరం ఆలయం ప్రాంగణంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కలిసి తేరు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రదర్ అనిల్ రాజవరపు, ఫాదర్ తంబి అన్నెం, పెద్దలు జెక్కిరెడ్డి చిన్నపరెడ్డి, దుగ్గెంపూడి ఇన్నారెడ్డి, శౌరిరాజు, మాలపాటి మరియదాసు, చందు, విజయ్, రాజు, జోషి, శౌరిబాబు, భక్తులు పాల్గొన్నారు.

మొబైల్ మెకానిక్ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణ మొబైల్ మెకానిక్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ గౌరవ అధ్యక్షుడు శెట్టుపల్లి పూర్ణ తెలిపారు. యూనియన్ అధ్యక్షుడుగా టి. శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా షేక్ రహీం, చాన్ బాషా, మున్నా, బిలాలు, మల్లీని ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నుకున్నారు. కార్మికులకు ఐడీ కార్డులు, ఇన్సూరెన్సు పాలసీలు అందిస్తామని, ఏమైనా క్లిష్ట సమస్యలు ఉంటే ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ద్వారా పరిష్కరించనున్నట్లు తెలిపారు. నూతన కమిటీకి పలువురు అభినందనలు తెలియజేశారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యం



పిడుగురాళ్ల రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యమని ఉన్నం చారిటబుల్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ ఉన్నం నాగమల్లికార్జునరావు పేర్కొన్నారు. మండలంలోని తుమ్మల చెరువు ప్రాథమిక పాఠశాలలో ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 450 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ బైరపోగు కుమారి, ఉప సర్పంచ్ రాగిడి రాజారావు, ఎంపీటీసీలు అల్లు పిచ్చిరెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ పందింటి రామిరెడ్డి , వైద్యులు ఉన్నం దీపిక, అశోక్, పవన్‌కుమార్, అఖిలా, సాయి, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

మాచర్ల వచ్చిన టీడీపీ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి

మాచర్ల: నియోజక వర్గ టీడీపీ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి కండిషన్ బెయిల్ పై ఆదివారం 3వ సారి మాచర్ల పట్టణానికి వచ్చి సంతకం చేశారు. తనతో పాటు మరో 22 మంది నిందితులతో వివిధ వాహనాలలో తరలి వచ్చిన ఆయన మధ్యాహ్నం 12గంటలకు సంతకం చేసి, వెనుతిరిగారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం..

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి

గురజాల: రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. స్థానిక నగర పంచాయతీలోని 4వ సచివాలయం పరిధిలో 10, 11వ వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహేష్ రెడ్డిని స్థానికులు ఘనంగా సత్కరించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. లేదా.. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆయన అడిగి తెలుసుకున్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సచివాలయం సిబ్బందికి, ప్రజా ప్రతినిధులుకు, అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీదేనన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో.. జన్మభూమి కమిటీల పేరుతో ఏ ఒక్క పథకం నిరుపేదలకు అందలేదని విమర్శించారు. పేదలు కార్యాలయాలు, అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగారని.. అయినప్పటికి వారికి పథకాలు అందలేదన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే వైఎస్సార్ సీపీ 2024లో కూడా అధికారంలోకి రావాలన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను మరోసారి ప్రతి ఒక్కరూ దీవించి సీఎంగా కూర్చోబెట్టాలని కోరారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి, వైఎస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య, జడ్పీటీసీ ఆరికట్ల శ్రీనివాస రెడ్డి, మాజీ సర్పంచ్ గడిపూడి పెద్ద చెన్నయ్య, కో-ఆప్షన్ సభ్యుడు గోళ్ల సైదయ్య, చైర్ పర్సన్ పోలు పవన్మయి వీరారెడ్డి, వైస్ చైర్మన్‌లు షేక్ బడే జానీ, మన్నెం కన్యాకుమారి ప్రసాద్, ముస్లిం మైనార్టీ నాయకుడు షేక్ నాగులు మీరా, మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, పట్టణ కన్వీనర్ కె.అన్నారావు, బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి చల్లా కాశీబాబు, కౌన్సిలర్ మహంకాళీ అంకమ్మ నీలంరాజు, కుక్కమూడి అనిల్ కుమార్, మంచి యశోద అంజి, కర్రా గిరిబాబు, కో-ఆప్షన్ సభ్యుడు షేక్ పీర్ అహ్మద్, సాంబశివరావు తదితరులున్నారు.

సేవాలాల్ మహారాజ్ జయంతోత్సవ ఆహ్వాన పత్రాల ఆవిష్కరణ

పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



కరపత్ర, ఆహ్వాన పత్రికలను విడుదల చేసిన పల్నాడు

మాచర్ల: దేశ వ్యాప్తంగా సద్గురు శ్రీ సేవా లాల్ మహారాజ్ 284వ జయంతి ఉత్సవాల ఆహ్వాన కరపత్రాలను ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. గోర్ బంజారా జిల్లా నాయకులు కరంటోత్ పాండు నాయక్, ఆర్.సోమ్లా నాయక్, రమావత్ బిచ్యాలు నాయక్, సపావత్ శ్రీను నాయక్, సపావత్ రవి నాయక్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వమించనున్నట్లు నిర్వాహక కమిటీ చైర్మన్ కరంటోత్ పాండునాయక్ తెలిపారు. బ్రహ్మనందపురం గ్రామానికి సమీపంలో ఏర్పాటు చేసిన సేవాలాల్ కీమాలాల్ జంక్షన్ వద్ద ఫిబ్రవరి 12న ఉదయం 10గంటలకు నిర్వహించే ఉత్సవాలకు ప్రతి గిరిజనుడు రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి నర్సరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు కృష్ణదేవరాయలు, ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంబా రవిబాబు, పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్, ఎస్పీ రవిశంకర్, గిరిజన ప్రముఖులు తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.

క్రీడాకారులకు బహుమతుల అందజేత

సంక్రాంతి పండుగ సందర్భంగా జమ్మలమడక గ్రామం వైఎస్సార్ యూత్ ఆధ్వర్యంలో మాచర్ల పట్టణంలోని ఎస్‌కేబీఆర్ బంగ్లా గ్రౌండ్‌లో జరిగిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు పీఆర్కే ముఖ్య అతిథిగా పాల్గొని, బహుమతులు అందజేశారు.

విజయ్‌శేఖర్ మృతి బాధాకరం

మాచర్ల సబ్ డివిజన్‌లో వర్క్ ఇన్స్‌పెక్టర్‌గా పని చేస్తూ ఆదివారం తెల్లవారు జామున గుండెపోటుతో వై.విజయశేఖర్ (50) మృతి చెందారు. ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి విజయశేఖర్ మృతదేహాన్ని సందర్శించారు. పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కెనాల్స్ అధికారులు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, వైద్యులు రామకోటయ్య, వార్డు కౌన్సిలర్లు శంకర్, మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, మాజీ కౌన్సిలర్ కొండూరు లెనిన్, మున్సిపల్ మాజీ చైర్మన్ తురక కిషోర్‌తో సంతాపం వ్యక్తం చేశారు.

కాశయ్య మాస్టారికి నివాళి

కారెంపూడి: మండలంలోని పెదకొదమగుండ్ల గ్రామానికి చెందిన చచ్చు పెదకాశయ్య మాస్టారుకు ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నివాళులర్పించారు. గ్రామంలో ఆదివారం కాశయ్య మాస్టారి దశ దిన కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే మాస్టారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అంగరంగ వైభవం.. మల్లాది వేంకటేశ్వరుని కల్యాణం



స్వామివారి కల్యాణోత్సవం

అమరావతి: భక్తుల పాలిట కొంగుబంగారం. కోరిన కోర్కెలు తీర్చే కలియుగ దైవం.. స్వయంభుగా వెలసిన మల్లాది వటవృక్షాంతర్గత వేంకటేశ్వరుని 46వ వార్షిక కల్యాణ మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. వేకువ జామున ఆలయ అర్చకులు వినుకొండ శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారి అభిషేకానికి బిందె తీర్థం కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి ప్రాతఃకాల అర్చన నిర్వహించారు. స్వామి వారికి పంచ సూక్తాలతో పంచామృత స్నపనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులు తీసుకొచ్చిన తులసీ దళాలతో స్వామి వారికి సహస్ర నామ తులసీదళ సేవ నిర్వహించి, విశేష అలంకారం గావించారు. 11 గంటలకు దేవాలయ ఉత్తర భాగాన ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో స్వామి వారి ఉత్సవ మూర్తులకు కల్యాణోత్సవం ప్రారంభించారు. వైఖానస ఆగమ శాస్త్రానుసారం పరుచూరి శ్రీనివాసాచార్యుల నేతృత్వంలో శనగవరపు రామ్మోహనశర్మ ప్రత్యక్ష వ్యాఖ్యానంతో సుమారు 50 మంది దంపతులచే స్వామి వారి కల్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు పెద శేష వాహనంపై ఉభయదేవేరులతో వేంకటేశ్వరుని గ్రామోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయ ఆవరణలో పొంగళ్లు పొంగించి, మర్రిచెట్టు వద్ద స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు.

కనుల పండువుగా శ్రీవారి కల్యాణం

మాచర్ల: పట్టణంలో బస్టాండ్ సెంటర్‌లో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం శ్రవణా నక్షత్రం పురస్కరించుకొని స్వామి వారికి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు వీరాంజనేయులురెడ్డి, చుండూరు మల్లికార్జునరావు, ఈఓ శ్రీగిరిరాజు నరసింహం బాబు ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవాలు జరిగాయి. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ పదవీకాలం పొడిగింపు

సత్తెనపల్లి: వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పట్టణంలోని వాల్మీకి నగర్ కు చెందిన ఎద్దుల దొడ్డి కోటేశ్వరమ్మ పదవీ కాలాన్ని మరో రెండేళ్లు పొడిగిస్తూ.. ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పట్టణంలోని వాల్మీకినగర్ రామాయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో కోటేశ్వరమ్మ సంతోషం వ్యక్తం చేశారు. తనపై ఎంతో నమ్మకంతో రెండేళ్లు డైరెక్టర్ పదవి పొడిగించినందుకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డికి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తోందన్నారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ సీపీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

రేపట్నుంచి నవ దిన ప్రార్థనలు ప్రారంభం



రెంటచింతల కానుక మాత చర్చి

రెంటచింతల: స్థానిక కానుక మాత చర్చి 173వ మహోత్సవ వేడుకలలో భాగంగా మంగళవారం నుంచి నవ దిన ప్రార్థనలు ప్రారంభం కానున్నట్లు విచారణ గురువు ఏరువ లూర్థుమరెడ్డి తెలిపారు. చర్చిలో విలేకర్లకు ఆదివారం ఆయన వివరాలు వెల్లడించారు. సోమవారం సాయంత్రం 4.30గంటలకు సాగరు మాత చర్చి విచారణ గురువు రెవ.ఫాదర్ పామిశెట్టి జోసఫ్ సాగర్ జెండాను ఆవిష్కరిస్తారని తెలిపారు. అనంతరం 1850లో నిర్మించిన పురాతనమైన కానుక మాత దేవాలయం ప్రాంగణంలో దివ్యపూజాబలితో పండుగ మహోత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు. 25న ఆరోగ్య మాత మందిరం వద్ద రెవ.ఫాదర్ రత్నరాజు, 26న ఫాతిమా మాత మందిరం వద్ద రెవ.ఫాదర్ ఎస్.సతీష్‌కుమార్, 27న బాలవికాస్ హైస్కూల్‌లో నిత్య సహాయమాత మందిరం వద్ద ఫాదర్ హృదయ్ సమస్కన్స్, 28న లూర్దు మాత మందిరం వద్ద రెవ.ఫాదర్ అంద్రెయ రాజు హెచ్‌జీఎస్, 29న ఆనంద పేటలో రెవ.ఫాదర్ కొమ్మారెడ్డి సందీప్‌రెడ్డి, 30న పిచ్చుకలగడ్డ మిట్టమీద రెవ.ఫాదర్ ఎ.తంబి ఎస్ సీజే, 31న పునీత ఆరోగ్యనాధుని మందిరం వద్ద రెవ.ఫాదర్ యామర్తి సురేష్, ఫిబ్రవరి 1న పునీత అంతోనివారి మందిరం వద్ద రెవ.ఫాదర్ కన్నా అనిల్‌తో ప్రతిరోజు సాయంత్రం గం.4.30గంటలకు దివ్యపూజాబలి సమర్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ నవ దిన ప్రార్థనలలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, కానుకమాత దీవెనలు పొందాలని ఫాదర్ వైఎల్ మర్రెడ్డి కోరారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య




రైతు కొండలు (ఫైల్)

కారెంపూడి: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో అప్పుల బాధతో కౌలు రైతు చెన్నూరి కొండలు (35) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో శనివారం అర్ధరాత్రి పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన గ్రామంలోని ఆర్ఎంపీ డాక్టర్ వద్దకు తీసుకెళ్లి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం నర్సరావుపేట వైద్యశాలకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో గుళ్లపల్లి వద్ద చెన్నూరి కొండలు మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులంతా కష్టపడి పని చేసేవారే. సొంత ట్రాక్టర్, ఎడ్లు ఉన్నప్పటికీ.. సొంత పొలం లేదు. కౌలుకు 22 ఎకరాల వరకు తీసుకుని తన సోదరుడితో కలిసి సేద్యం చేస్తున్నాడు. ఖరీఫ్‌లో పత్తి రెండు ఎకరాలు, మిర్చి రెండు ఎకరాలు, మిగతా పొలంలో వరి వేశారు. ఆశించిన దిగుబడి రాకపోవడంతో పాటు ఎకరం రూ.15 నుంచి రూ.20 వేల వరకు కౌలుకు తీసుకున్న పొలం కావడంతో గత మూడేళ్లుగా ఎంతో కొంత అప్పు ఏటా మిగులుతూ వస్తోంది. ఆ అప్పులు వడ్డీలతో కలుపుకుని రూ.15 లక్షల వరకు అయ్యాయి. అప్పులు తీర్చే మార్గం కానరాక కుటుంబంలో మొదలైన అశాంతితో కొండలు మనోవేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీస్, రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. మృతదేహాన్ని ఆదివారం పోస్టుమార్టం నిమిత్తం గురజాలకు తరలించారు. కౌలు రైతు కొండలుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం అలుముకుంది.

నేడు మాచర్ల ఏఎంసీ ప్రమాణ స్వీకారం



చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి



వైస్ చైర్మన్ పాండురంగారావు

మాచర్ల: మాచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ నూతన చైర్మన్ ఉప్పలపాడు తాడి వెంకటేశ్వరరెడ్డి (పెద్దబ్బాయ్), వైస్ చైర్మన్ కొత్తమాసు పాండురంగారావుతో పాటు పలువురు డైరెక్టర్లు సోమవారం ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆదివారం మార్కెట్ యార్డు చైర్మన్, వైస్ చైర్మన్‌లు విలేకరులతో మాట్లాడారు. నూతనంగా ఎంపికైన డైరెక్టర్లు, కమిటీ సభ్యులందరూ సోమవారం సాయంత్రం 6గంటలకు భారీ ర్యాలీగా బయలుదేరి పీఆర్కే, పీవీఆర్‌ల ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శులు శ్రీనివాసశర్మ, జూలకంటి వీరారెడ్డి, ఉప్పలపాడు మేకల కోటిరెడ్డి కోరారు.

నేటి నుంచి ప్రతిష్ట మహోత్సవాలు ప్రారంభం

జెట్టిపాలెం(రెంటచింతల): మండలంలోని జెట్టిపాలెం గ్రామ శ్రీ సీతారామస్వామి ఆలయంలో సోమవారం నుంచి ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభంకానున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు భువనగిరి ఆంజనేయ శాస్త్రి, కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. బ్రహ్మశ్రీ సాగి నరసింహమూర్తి ఆధ్వర్యంలో జీవధ్వజ, ముత్యాలమ్మ గ్రామ దేవత, పోతురాజు, శతరుద్ర సహిత శత చండీ, మహా మృత్యుంజయ యాగ, పాత పాటేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, పురందేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం పాంచాహ్నిక దీక్షతో నిర్వహించనున్నట్లు తెలిపారు. 5 రోజుల పాటు.. యాగశాలలో రుత్విక్కులచే హోమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ నెల 27న ఉదయం 9.56గంటలకు యంత్ర స్థాపనం, విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించి మధ్యాహ్నం 12గంటలకు భక్తులకు అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రతిష్ఠా మహోత్సవంలో భక్తులు పాల్గొని స్వామివార్ల ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు.

ప్రశాంతంగా పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్ష



డీఎస్పీతో మాట్లాడుతున్న అడ్మిన్ అడిషనల్ ఎస్పీ బిందుమాధవ్

సత్తెనపల్లి: పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. సత్తెనపల్లి మండలం కంటెపూడి సమీపంలోని నలంద ఇంజినీరింగ్ కళాశాలలోని రెండు బ్లాకుల్లో పరీక్ష జరిగింది. మొత్తం 776 మంది అభ్యర్థులకు.. 660 మంది పరీక్షకు హాజరయ్యారు. 116 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాన్ని అడ్మిన్ అడిషనల్ ఎస్పీ బిందు మాధవ్ సందర్శించి, పరిశీలించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పరీక్షల నిర్వహణ చేపట్టారు.

నేడు గురజాల ఏఎంసీ పాలకవర్గ ప్రమాణస్వీకారం

గురజాల : గురజాల-దాచేపల్లి మార్కెట్ యార్డు నూతన పాలక వర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం సోమవారం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల, పట్టణ కన్వీనర్లు సిద్దాడపు గాంధీ, కె.అన్నారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గురజాల మార్కెట్‌యార్డు నందు మధ్యాహ్నం 3 గంటలకు ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయులు, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి, గుంటూరు మార్కెట్‌యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం పాల్గొంటారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు

గోలి(రెంటచింతల): మండలంలోని గోలి గ్రామంలోని నిదానంపాటి శ్రీ లక్ష్మి అమ్మవారి ఆలయంలో ఆదివారం అర్చకులు రామరాజు కేశవరావు నేతృత్వంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి పొంగళ్లు సమర్పించారు. భక్తులకు ఆలయ ధర్మకర్త బత్తినేటి బాల కోటేశ్వరరావు అన్నదానం చేశారు. కమిటీ సభ్యులు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

గురజాల : నగర పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను సోమవారం ప్రారంభించనున్నట్లు నగర పంచాయతీ చైర్‌పర్సన్ పోలు పవన్మయి వీరారెడ్డి, మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం జంగమహేశ్వరపురంలో అర్బన్ హెల్త్ క్లీనిక్, గ్రంథాలయంలో నూతన గదులు ప్రారంభం.. బస్టాండ్ వద్ద మాజీ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందారెడ్డి విగ్రహావిష్కరణ, మార్కెట్ యార్డు నూతన పాలక వర్గ కమిటీ ప్రమాణ స్వీకారం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలకు రాష్ట్ర మంత్రులు విడదల రజనీ, ఆదిమూలపు సురేష్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, గుంటూరు మార్కెట్ యార్డు చెర్మన్ చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొంటారని తెలిపారు.